
# రామ్మూర్తి పిచ్చి

మమత పండరీనాథ్




మారువేషమేసుకొచ్చిన హీరోలా అగుపించాడు రామ్మూర్తి, రాజారావ్‌కీవేళ. జరగకూడనిది ఏదో జరిగినట్టు ఆఫీసులో మినీ కలవరం బయల్దేరింది.

నవ్వుకు వాచిపోయిన రామ్మూర్తి నల్లని పెదాలు పదివేల కుసుమాలు ఒక్కసారే విప్పారినట్టుగా నవ్వేయి. చంకలకిందో, వీపు మీదో చిరుగులుండే లూజు చొక్కాలేసుకొచ్చే రామ్మూర్తి ఈవేళ పిటపిటలాడే ప్యాంటు, షర్ట్ ప్లస్ టక్ చేసుకుని బూజు తుడ్చి అలంకరించబడ్డ శిల్పంలా వచ్చాడు.

కాళ్లకు, ఫుట్‌పాత్‌మీద కొన్న హవాయ్ చెప్పులు లేవు. మిలమిల మెరిసే 'అంబాసిడర్' షూ వున్నాయ్! జిడ్డుకారే మొహం కళకళలాడుతున్నది.

గడ్డిపరకల్లా ఎగిరి మొహంమీద పడే వెంట్రుకలు సమ్మెమాని 'మేమంతా వొహటే' అన్నట్టుగా చక్కటి క్రాఫ్‌గా మారేయి.

రామ్మూర్తి అకస్మాత్తుగా మారటానికి గల కారణం ?

ఆ ప్రయివేట్ ఆఫీసులో అదో పబ్లిక్ మీటింగ్ అయ్యింది.

మేనేజర్ రాజారావ్ కిటికీలోంచి తూర్పు దిక్కుగా చూసేడు. ''నే చక్కగానేవున్నా''- అన్నట్టుగా తన శీలాన్ని శంకిస్తున్నందుకు మార్తాండుడు మండిపడుతున్నాడు.

రాజారావ్‌లోని మేనేజర్ కూడా మండిపడుతున్నాడు.

''ప్యూన్ వెధవకింతటి ఆడంబరమా ?'' పులివాత పెట్టుకున్న నక్కలా అగుపిస్తున్నాడు రామ్మూర్తి, రాజారావ్‌కి.

అర్హతకు తగ్గ ఆడంబరం సంబరంగా వుంటుందని అతని అభిప్రాయం.

''ఏవండీ రాజారావ్‌గారూ! రోజూ ఈపాటికి కాఫీనీళ్ళు ఓ గుక్క పోసుకుని చక్కగా పనిచేసుకునే వాళ్ళం''—అకౌంటెంట్ కొండల్రావ్ పెట్టీ క్యాష్‌బుక్‌ని పక్కకి తోసేస్తూ, తన అవసరాన్ని ఇన్‌డైరెక్ట్‌గా గుర్తుచేసాడు.

అడక్కముందే కాఫీతెచ్చి తలోగ్లాసులో పంచే రామ్మూర్తి, ఆఫీసుకు రాగానే హాలంతా ఫ్యాషన్ పేరెడ్‌గా చేసి, స్టాఫ్ నంతా ఆశ్చర్యంలో ముంచి డైరెక్టర్ రూంలోకెళ్ళి ఇంకా రాలేదు. అదో సర్‌ప్రైజ్.

డైరెక్టర్ వామన్రావ్ ఓ పెద్ద కమీషన్

ఆర్డర్ రావాల్సివుండి ఢిల్లీ కెళ్ళాడు మూడ్రోజుల క్రితం. ఇవ్వాళ రావాల్సివుంది. ఏ క్షణాన్నైనా ఊడిపడ్తాడు.

రామ్మూర్తి డైరెక్టర్ రూంలోకెళ్ళి అర్ధగంట అవుతున్నది. ఏం చేస్తున్నాడక్కడ? అందరి బుర్రలని తొలిచే ప్రశ్న అది.

ఐరన్ సేఫ్ అక్కడే వుంటుంది. ఇంపార్టెంట్ ఫైల్సన్నీ అక్కడే వుంటాయ్. యస్.టి.డి. కనెక్షన్ వున్న ఫోనూ అక్కడే వుంటుంది.

డైరక్టర్ లేని ఆ రూంలో ఐరన్‌సేఫ్‌ని బ్రద్దలుకొడ్తున్నాడా ?

ఇంపార్టెంట్ ఫైల్స్‌ని తస్కరిస్తున్నాడా?

యస్. టి. డి. కాల్స్ ఎక్కడికైనా చేసేస్తున్నాడా ?

ఇక లాభం లేదనుకొని రాజారావ్ అశ్వంలా పరుగెత్తాడు డైరక్టర్ రూంలోకి. ఎంత వేగంగా వెళ్ళాడో అంతే వేగంగా నోరు లబోదిబో కొట్టుకుంటూ తిరిగొచ్చి —

"మీరంతా డైరక్టర్ రూంలో కన్పించే వింత దృశ్యాన్ని చూడాలహో'' — అని స్టాఫ్‌కి దండోరా వేసాడు గుండెని డోలు చేస్కోని.

అకౌంటెంట్ కొండల్రావ్, కవల స్టెనోలు సుజన, రజని, సేల్స్ రిప్రజెంటేటివ్స్ అయిన సుబ్బారావ్, అప్పారావ్‌లు సినిమా స్టార్ట్ అయిందనే ఆత్రంతో హాల్లోకెళ్ళే ప్రేక్షకుల్లా డైరక్టర్ రూంలో కెళ్ళారు.

ఆ దృశ్యాన్ని చూడగానే వాళ్ళ నోళ్ళు విశ్వాన్ని చూపించిన కృష్ణుడి నోరులా తెర్చుకున్నాయి.

వాళ్ళ మధ్యనించి రాజారావ్ కళ్ళను జ్యోతుల్లా చేస్కోని, రాళ్ళనుకూడా పిండి చేస్తానన్నట్టుగా పళ్లను పటపట లాడించేడు ముందుకొచ్చి.

డైరక్టర్ సీట్లో ఫ్యాన్లా గిర్రున తిరిగే రామ్మూర్తి వచ్చినవాళ్ళ ముఖమైనా చూడకుండా యధాలాపంగా తన స్పీడ్‌ను పెంచుకుంటూ తిరగసాగేడు —

"సూర్యుడిచుట్టూ తిరుగుతోంది భూగోళం'' — అనే పాటను కర్ణకఠోరంగా పాడుకుంటూ.

"ఒరే! రామ్మూర్తీ! నీ కిదేం పోయేకాలం ?'' -- రాజారావ్ బల్లపైన గుద్దాడు పిడికిలిని.

తిరిగే కుర్చీ ఆగిపోయింది. రామ్మూర్తి అందరివంకా చూసేడు — రమ్యంగా నవ్వేడు.

"నా పాట వింటే గాడిదలొస్తాయని నాకు తెల్సు'' —

ఆ మాటకి అందరి మొహాలు మాడిపోయాయి. "ఒరేయ్'' అంటూ రాజారావ్ తన చేతిని పైకి లేపాడు.

రామ్మూర్తి తక్కున లేచి రాజారావ్ చేతిని జెండా దింపినట్టుగా కిందికి దింపేసేడు. "ఖబడ్దార్!'' బల్ప్రయోగం నా దగ్గర పనికిరాదు.

ఈ రామ్మూర్తి మునపటి రామ్మూర్తి కాదు. వీడిలో చైతన్యం వచ్చింది. 'అరే' అంటే 'ఏారే' అనాల్సివస్తుంది. మర్యాద ఇచ్చిపుచ్చుకోవాలి.

కాఫీలు లేక మీ గొంతులు ఎండిపోయుంటాయని నాకు తెల్సు. దేశంలో ఎన్నో ప్రాంతాలు అనావృష్టితో బాధపడుతున్నాయ్. మీ గొంతులుకూడా అంతే అనుకుంటాను.

### గమనిక

గేయాలు పంపేవారు వాటితో తపాలా కార్డు జత పరచవలసి వుంటుంది. గేయాలు త్రిప్పి పంపబడవు. గేయాలు, కవితలు సాధ్యమైనంత క్లుప్తంగా వుండటం మంచిది

సం.

ఇంటి దగ్గర కాఫీ తాగిరాకుండా, ఆఫీసు సొమ్మని రోజుకు 'సెంచరీ' టైప్స్‌గా కాఫీని కుడితి తాగినట్టు తాగుతుంటారా! తప్పకదూ! రాజారావ్‌గారూ.

నేను పొద్దున్న ఎనిమిది గంటలకు ఆఫీసుకు రావాలి.

మీరేమో మహారాజుల్లాగా పది గంటలకు, పదకొండు గంటలకు రావాలి — ఆఫీసులో ఎక్కడైనా బూజు కన్పడితే నా దుమ్ము దులిపేసేవాళ్ళు — చీటికీ మాటికి కిళ్లీలు, సిగరెట్స్ వన్‌బైవన్ అన్నట్టుగా తీస్కు రావాలి. కాస్త ఆలస్యమైతే బూతుపాటలు పాడేవాళ్ళు. ఏరా, దున్నపోతా, రాస్కెల్, గాడిదా, చివరకు బాస్టర్డ్. ఇవి మీరు నా కిచ్చిన బిరుదులు. నేనూ ఆత్మాభిమానం కలిగిన మనిషిని. విధిలేక ఆత్మవంచనతో మీ ఆఫీసులో ప్యూన్ పన్జేస్తున్నాను.''

రాజారావ్ మొహం వెలవెలబోయింది. ఏమీ అర్థంగాక కొండల్రావ్ వంక చూసేడు, ఆందోళనగా.

"ఏవండీ! కొండల్రావ్‌గారూ! గుడివీ, లింగాన్ని టాబ్లెట్స్‌కన్నా ఈజీగా మింగేసే వాళ్ళు మీరు. అడ్వాన్స్ ఎప్పుడైనా అడిగితే, మీ వొంట్లో రక్తాన్ని పిండుకు పోయినట్లుగా బాధపడేవారు. పైగా "మీ నాన్న కర్మకా? మీ ఇంట్లో ఎవరి తద్దినమోయ్ ?''—లాంటి అందమైన ఈటెలతో పొడ్చేవాళ్ళు.

నేను కూడా మీలానే ఎదురు తిరిగి మాట్లాడితే, మీ మొహం ఎక్కడ పెట్టుకోవాలో మీకు తెల్సివుండేది కాదు.

డ్రాయర్లో చిల్లరపైసలు పోయేయని నో సారి చేయి చేసుకున్నారు కూడా, గుర్తుందా. ఆ రోజు ఎంతగానో కుమిలి కుమిలి ఏడ్చానో నాకు బాగా గుర్తుంది.''

రామ్మూర్తి చేయి గాలిలోకి లేచి కొండల్రావ్ చెంపను రీసౌండ్ వచ్చేలా చెళ్ళుమన్పించింది. కాకతాళీయంగా జరిగిన యీ అనూహ్యమైన సంఘటనకు కొండల్రావ్ హతాశుడైపోయాడు, కొన్ని క్షణాల వరకు.

"మీ నాన్న కర్మ జరిగిందా? మీ ఇంట్లో తద్దినం పెట్టావా? ఏం మాట్లాడవేం ?'' పెద్దగా అరిచాడు రామ్మూర్తి.

రాజారావ్, కొండల్రావ్ చెవిలో నోరు పెట్టాడు. "ఏమీ అనకు, రామ్మూర్తికి పిచ్చిపట్టినట్టుగా వుంది.''

"ఇక ఈ టైపిస్ట్ అక్కల విషయానికొస్తే -

రబ్బరు బొమ్మల్లా, స్వయంవరంలో యువరాణుల్లా వస్తారు. రాగానే స్టేజీ ఎక్కబోయే హీరోయిన్లా గంటపైన సింగారం. తర్వాత మిషన్లో పేపర్ పెడతానికి ఓ అర్ధగంట, ఒళ్ళు దాచుకోకుండా పన్జేస్తారు. లంచ్ అవర్లో టిఫిన్ తేవటం కాస్త ఆలస్యం అయితే చాలు తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్లగారడీని ప్రదర్శిస్తారు — నన్ను చూసి ఒకటే ఇకఇకలు, పకపకలు; నేనంత వికారంగా వుండొచ్చు. కానీ నాకూ ఆత్మ సౌందర్యం వుంది. పచ్చ కళ్ళ జోడెట్టుకుని మిసమిసలాడే మిస్సులు కాబట్టి మీకది కన్పించదు.''

డైరెక్టర్ వామన్రావ్ ఢిల్లీ వించి ఎప్పుడొచ్చాడో ఏమో? అందర్నీ తోసుకుంటూ టేబుల్ ముందుకొచ్చి మంత్రించిన ప్రతిమలా నిలబడిపోయాడు.

రామ్మూర్తి నిర్లక్ష్యంగా డైరక్టర్‌వంక చూస్తూ నింపాదిగా లేచేడు.

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

# 1981 దీపావళి కథల పోటీ

## మొత్తం రు. 5000 ల బహుమతులు

**ఈసారికూడా దీపావళికి కథానికలపోటీ పెడుతున్నాము.. పోయినేడాదిలాగే యీ ఏడు కూడా సంపాదకుని ఎన్నికలో ఉత్తమంగా వచ్చిన ఐదు కథలను ఆంధ్ర సచిత్ర వారపత్రిక దీపావళి సంచికలో, ఆ తరువాతి సంచికలో వేస్తాము. అటు తరువాత పాఠకుల బ్యాలట్ నిర్వహిస్తాము.**

## ముగింపు తేదీ 14-9-'81 సోమవారం

పోటీలో ఎన్నికైన ఐదు కథలకు ఒక్కొక్కదానికి రు **600** ల చొప్పున బహుమతులు యిస్తాము అటు తరువాత బ్యాలట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో వచ్చిన మూడు కథలకు రు **600**, రు. **500**. రు **400** ల వంతున అదనపు బహుమతులు యివ్వడమే గాక మిగిలిన రెండు కథలకు రు. **250** ల చొప్పున కన్సొలేషన్ బహుమతులను అందజేస్తాము.

★ 'కథానిక' ఆంధ్ర సచిత్ర వారపత్రికలో నాలుగు పేజీలు మించకుండా వుండాలి 12 అరఠావుల దాటకుండా వ్రాస్తే చాలు నిడివి ఎక్కువ అయిన కథలకు బహుమతి రాగల అవకాశాలు చాలా తక్కువ అని గమనించాలి

★ కథావస్తువు తెలుగువారి సామాజిక జీవితానికి సంబంధించి వుండాలి

★ అనువాదం, అనుసరణ, అనుకరణ కాపీ కథలు పంపకూడదు ఏసారమైనా, ప్రచురణ అయిన లేద ఇతర పత్రికలకు పంపబడి పరిశీలనలో వున్న కథలు అసలె పంపకూడదు

★ పై అంశాల మేరకు హామీ పత్రం ప్రతి కథతోపాటు విధిగా వుండి తీరాలి. కలం పేరు వాడినా అసలు పేరు, యింటి పేరు ఏవో పూర్తిగా విడిగా స్పష్టంగా పూర్తి చిరునామాతోపాటు అందిన కథలనే పరిశీలించ వీలవుతుంది

★ కథలతోపాటు రచయితల పేర్లు పడవు బ్యాలట్ తరువాత వారి పరిచయాలతో వేస్తాము

★ రచనలపై పేచీలు వస్తే రచయితలే బాధ్యత వహించవలసి వుంటుంది

★ పోటీలో నెగ్గిన కథల రచయితలు తమ ఫొటో, జీవిత విశేషాలు మొదలైనవాటిని పంపి, వాటి ప్రచురణకు అంగీకరించాలి

★ ముగింపు తేదీ దాటిన తరువాత అందిన కథలను మామూలు ప్రచురణకు వీలువెంబడి పరిశీలిస్తాము పోటీకి పంపిన కథలను ఎటి పరిస్థితులలోను తిప్పి పంపలేము

సం॥

# రామ్మూర్తి పిచ్చి

"మిస్టర్ రామ్రావ్! టేక్ యువర్ సీట్."

"నీ డ్రెస్సేమిటి? నా సీట్లో కూర్చోట మేమిటి? నీకేమయినా పిచ్చిపట్టిందా?" రామ్రావ్ కళ్లు పెద్దవిచేస్తూ హూంకరించాడు.

"అవును. రామ్మూర్తికి పిచ్చిపట్టింది"— స్టాఫంతా నినాదం చేసారు.

"అయితే వైజాగ్ ఆస్పత్రికి ఫోన్ చేద్దాం" రామ్రావ్ నెంబర్ డయల్ చేయబోయాడు ట్రంక్ బుకింగ్‌కి.

"మీకా శ్రమ అక్కర్లేదు రామ్రావ్! ఈ పిచ్చి ఇవ్వాళ ఒక్క రోజే. బై ది బై మీకో మాట.

పదో తరగతి ఫెయిలయ్యానని ఇక్కడ ప్యూన్‌గా చేరిన మొదటి రోజే మీకు అబద్ధం చెప్పాను. కారణం నా క్వాలిఫికేషన్ గురించి నిజం చెప్తే దాని స్థాయికితగ్గ వుద్యోగం మీవద్ద లేదు. ఉద్యోగం లేక మూడు సంవత్సరాలు బికారిలా తిరిగాను. నాన్న రిటైరై పోయారు. అమ్మ మంచానికి అంటుకుపోయింది అనారోగ్యంతో. పెండ్లి వయస్సులో ఉయ్యాలూగే చెల్లాయికి పెండ్లి చెయ్యాలి. ఇల్లు గడవాలంటే ఏదో ఉద్యోగంలోనైనా చేరాలి. జీతం ఎంతైనా ఫర్లేదు. అందుకే మూడొందల రూపాయలకు మీ ఆఫీసులో ప్యూన్‌గా చేరాను. మీ ఆఫీసులో నరకంలో బాధించబడే పాపిలా బ్రతికాను. 'చీకటి తర్వాతే వెలుగు' అనే ఆశాసూత్రంపై నాకు నమ్మకం లేకపోయినా ఇప్పుడు మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను.

నాకు డి. యస్. పి. ఉద్యోగం వచ్చింది.

అసలు విషయం మర్చాను. నా క్వాలిఫికేషన్ యం. ఏ.

నా తర్వాత ఎవరైనా ప్యూన్‌గా వస్తే అతన్ని మనిషిగా చూడండి.

రేపే ఉద్యోగంలో చేరాలి" అని గంభీరంగా, వడివడిగా వెళ్లే రామ్మూర్తి వంక, డైరక్టర్‌తోసహా మిగతా స్టాఫంతా బిక్క మొహాలేస్తూ చూడసాగారు.

ఆ ఆఫీసునించి చివరిసారిగా బయటికెళ్లిపోతున్న రామ్మూర్తికి టాటా చెప్పేందుకు గామోసు ట్రింగ్, ట్రింగ్, ట్రింగ్, ట్రింగ్ మంటూ మోగసాగింది టెలిఫోన్.